క్లుప్తంగా

రాయిపల్లి(డి) సొసైటీ చైర్‌పర్సన్‌గా మణెమ్మ



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సభ్యులు

జహీరాబాద్ టౌన్: మండల పరిధిలోని రాయిపల్లి(డి) సొసైటీ చైర్‌పర్సన్‌గా మణెమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సొసైటీ చైర్మన్‌గా ఉన్న కుమ్మరి రాచన్న ఇటీవల మృతి చెందడంతో ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిణిగా శోభారాణి వ్యవహరించారు. డైరెక్టర్లు విఠల్‌రెడ్డి, రవికుమార్, ప్రేమలమ్మ, స్వామిదాస్, గోపాల్, మోహన్‌రెడ్డి, లక్ష్మన్న, శేఖర్, పార్వతమ్మ, ప్రభాకర్‌రెడ్డి కలిసి చైర్‌పర్సన్‌గా మాణెమ్మను, వైస్‌చైర్మన్‌గా అమర్‌నాథ్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. మణెమ్మ ఎన్నికపై మాజీ సర్పంచ్ కొండాపూరం నర్సింహులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు, సభ్యులు రాంచందర్, ఏసురత్నం, బక్కన్న, జైరాజ్, విజయ్, విఠల్, చిరంజీవిరెడ్డి, బలవంత్, పాల్గొన్నారు.

వాల్యు జోన్ హైపర్ మార్ట్ సేవలు అభినందనీయం



దుస్తులను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కుమార్‌యాదవ్

పటాన్‌చెరు టౌన్: అంగన్‌వాడీల బలోపేతానికి వాల్యు జోన్ హైపర్ మార్ట్ ముందుకురావడం అభినందనీయమని కార్పొరేటర్ కుమార్‌యాదవ్ అన్నారు. ఈ మేరకు పటాన్‌చెరు అంగన్‌వాడీలో పిల్లలకు ఉచితంగా దుస్తులు, బూట్లు, తరగతి గదిలో ఫ్యాన్‌లతో పాటు బ్లాక్ బోర్డులను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పటాన్‌చెరు టౌన్: పట్టణ పరిధిలోని బండ్లగూడ మార్క్స్ కాలనీలో డ్రైనేజీ నీరు ఇళ్లల్లోకి రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్‌యూసీఐ (సోషలిస్ట్ యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో ఆ పార్టీ పటాన్‌చెరు ఇన్‌చార్జ్ షేక్ జానీ భాషా సోమవారం జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైనేజీ సమస్య కారణంగా దుర్వాసన వెదజల్లుతోందన్నారు. దీంతో వెంటనే సమస్యను పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో సభ్యులు దేవయ్య, అబ్దుల్ సత్తార్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అన్నదానం

సంగారెడ్డి: పట్నం మాణిక్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణులకు, వారితో వచ్చే బంధువులకు, ఆస్పత్రి సిబ్బ ందికి అన్నదానం ఏర్పాటు చేశారు. 28వ సోమ వారం అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపా రు. కార్యక్రమంలో పట్నం మాణిక్యం యువసేన సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని బొల్లారంలో ఉన్న తెలంగాణ మోడల్ స్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు గుజరాత్‌లో నిర్వహించనున్న 19వ జాతీయ స్థాయి ఇంటర్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. ఈ మేరకు సోమవారం విలేకర్లతో ఆమె మాట్లాడుతూ మోడల్ స్కూల్‌లో విద్యను అభ్యసిస్తున్న అక్షిత్, వైష్ణవి, సంధ్య, అక్షయలు అథ్లెటిక్స్ పోటీలకు ఎన్నికయ్యారు. ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు అహ్మదాబాద్‌లోని గుజరాత్ యూనివర్సిటీలో ఈ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలకు ఎన్నికైన విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

చిరుధాన్యాల్లో పోషకాలు పుష్కలం

- ప్రొఫెసర్ వినోద్, నాబార్డ్ డీడీఎం తిమోతి, ఏడీఏ భిక్షపతి
- ముగిసిన పాత పంటల జాతర



జీవవైవిధ్య సంరక్షకురాలికి జ్ఞాపికను ప్రదానం చేస్తున్న అధికారులు, ప్రొఫెసర్లు

ఝరాసంగం(జహీరాబాద్): చిరుధాన్యాల్లో పోషకాలు పుష్కలంగా లభిస్తాయని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్–ప్రొఫెసర్ వినోద్ పావురాల, నాబార్డ్ డీడీఎం–సంగారెడ్డి కృష్ణతేజ, డీడీఎస్ డైరెక్టరు రుక్మిణిరావు అన్నారు. డెక్కన్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో గత నెల 14న ప్రారంభమైన జాతర నియోజకవర్గంలోని వివిధ మండలాల్లోని 22 గ్రామాల్లో విత్తనాలను ప్రదర్శించి చిరుధాన్యాల సాగు విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాచ్నూర్ గ్రామ శివారులో 24వ పాత పంటల జాతర ముగింపును సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ప్రొఫెసర్ వినోద్ పావురాల, నాబార్డ్ డీడీఎం–సంగారెడ్డి కృష్ణతేజ, డీడీఎస్ డైరెక్టర్ రుక్మిణిరావు మాట్లాడుతూ.. నేటి కాలంలో తీసుకునే ఆహారం పూర్తిగా కలుషితం కావటంతో పోషకాలు లభించటం లేదన్నారు. దీంతో ఎంతో మంది చిన్న వయస్సులోనే అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డీడీఎస్ వ్యవస్థాపకులు సతీష్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు.

మిల్లెట్ మిషన్ ద్వారా సాగు విస్తీర్ణం

దేశంలోని వివిధ రాష్ట్రాలలో మిల్లెట్ మిషన్ ప్రోగ్రాం ద్వారా చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచేందుకు ప్రయత్నిస్తున్నారని డీడీఎస్ డైరెక్టరు రుక్మిణిరావు అన్నారు. చిరుధాన్యాల విస్తీర్ణం ఇంకా చాలా పెరగాల్సిన అవసరం ఉందని తెలిపారు.

మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి

సేంద్రీయ ఎరువులతో కూడిన చిరుధాన్యాలను సాగుచేస్తున్న తమకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని రైతులు పేర్కొన్నారు. తాము పండించిన పంటలకు మార్కెటింగ్ లేకపోవటంతో దళారులకు అమ్ముకుంటున్నామని వాపోయారు. మద్దతు ధర కల్పించి, మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం జీవవైవిధ్య సంరక్షకులు చెరక్‌పల్లి మరియమ్మ, జాదవ్ సుశీలాబాయి, మల్లె రాములమ్మ, రోజమ్మ, మంజులమ్మను అధికారులు, ప్రొఫెసర్లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వికాస కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు–విశాఖపట్టణం కిరణ్, డీడీఎస్ బోర్డు మెంబరు, సెంటర్ రిసెర్చ్ ఫర్ సస్టేనబుల్ అగ్రికల్చర్ రామాంజనేయులు, డీడీఎస్ బోర్డుమెంబర్, రిటైర్డ్ ఇండియన్ ఆడిట్, అకౌంట్స్ సర్వీస్ అధికారి వేదాకుమారి, డీడీఎస్ ప్రతినిధులు మాణిక్యం, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

యువత అన్నిరంగాల్లో రాణించాలి



గెలుపొందిన జట్టుకు ట్రోఫీ, చెక్కును అందజేస్తున్న ఉజ్వల్‌రెడ్డి

జహీరాబాద్: యువత అన్నిరంగాల్లో రాణించాలని జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఉజ్వల్ రెడ్డి అన్నారు. గత 15 రోజుల పాటు సాగిన ఉజ్వల్ రెడ్డి క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ పోటీల్లో రాయిపల్లి(డి) జట్టు గెలుపొంది టైటిల్ దక్కించుకుంది. ఆదివారం డే అండ్ నైట్ ఫైనల్ మ్యాచ్ స్థానిక బాగారెడ్డి స్టేడియం గ్రౌండ్‌లో జరిగింది. ఫైనల్ మ్యాచ్‌లో జహీరాబాద్ మండలంలోని రాయిపల్లి(డి) జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 80 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జహీరాబాద్ స్టార్స్ జట్టు 65 పరుగులకే పరిమితం అయింది. దీంతో ఉజ్వల్‌రెడ్డి క్రికెట్ టోర్నమెంట్ విన్నర్‌గా నిలిచిన రాయిపల్లి(డి) జట్టుకు కప్‌తో పాటు రూ.2లక్షల నగదును అందజేశారు. రన్నర్‌గా నిలిచిన జహీరాబాద్ స్టార్స్ జట్టుకు కప్‌తో పాటు రూ.లక్ష నగదును అందజేశారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీపీ గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయ జయంతి

జోగిపేట(అందోల్): మార్కండేయ జయంతి జోగిపేట పట్టణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మార్కండేయ దేవాలయంలో పూజలు నిర్వహించారు. జోగిపేట మార్కండేయ పద్మశాలి భక్తమండలి నాయకులు సత్యం, సత్యం, అనంతరాజ్, సుధీర్, లక్ష్మణ్, రాజశేఖర్, రాజేందర్, బాల్‌రాజ్, శ్రీకాంత్, వెంకటేశం, వీరేశం, రవి, పవన్ పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో...

జహీరాబాద్ టౌన్: పద్మశాలీల కులదైవమైన మార్కండేయ జయంతిని జహీరాబాద్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మార్కండేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పద్మశాలి సంఘం అధ్యక్షుడు గడ్డం జనార్ధన్, నాయకులు కర్దాస్ మనోహర్, పద్మరమేష్‌బాబు, నర్సింహులు, శివరాజ్, రాములు నేత, సుధీర్ బండారీ, విజయ్‌కుమార్, జగన్, విఠల్, పండరి, వీరేశం, వెంకటయ్య, సత్యనారాయణ, దత్తాత్రి, నవీన్, వెంకటేశం పాల్గొన్నారు.

నారాయణఖేడ్: మండల పరిధిలోని వెంకటాపూర్ చౌరస్తా సమీపంలోని మార్కండేయ భవన్‌లో సోమవారం మార్కండేయ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పద్మశాలీ పెద్దలు ధ్వజారోహణం, భక్త మార్కెండేయుడి జెండాను ఎగురవేసి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

పటాన్‌చెరు పద్మశాలి నూతన కమిటీ ఎన్నిక

సంఘం పటాన్‌చెరు టౌన్: పద్మశాలీల ఆరాధ్య దైవమైన మార్కండేయ జయంతిని జహీరాబాద్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. పటాన్‌చెరు డివిజన్ పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా సీతవైద్యం కిషోర్‌ను ఏకగ్రీవ ఎన్నుకున్నారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణ, ప్రధాన సలహాదారుడిగా సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా జ్ఞానేశ్వర్, ట్రెజరర్‌గా సంగమేష సెక్రటరీగా మదన్ రమేష్, ముఖ్య సలహాదారులుగా వేణుగోపాల్ తదితరులను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఆర్డీఓ వెంకారెడ్డి బదిలీ

జహీరాబాద్: ఆర్డీఓ వెంకారెడ్డి బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వెంకారెడ్డిని శేరిలింగంపల్లి డిప్యూటీ కలెక్టర్‌గా నియమించారు. ఇతని స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. ఇదిలా ఉంటే ఎక్సైజ్ శాఖలోనూ బదిలీలు జరిగాయి. జహీరాబాద్ ఎక్సైజ్ సీఐగా ఉన్న అశోక్ కుమార్ బదిలీ అయ్యారు. ఈయనను నారాయణపేటకు బదిలీ చేశారు. అశోక్‌కుమార్ స్థానంలో శ్రీనివాస్ బదిలీపై జహీరాబాద్ రానున్నారు. ఇతడిని ఇబ్రహీంపట్నం నుంచి జహీరాబాద్‌కు బదిలీ చేశారు. ఈ మేరకు ప్రొహిబీషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు.

నూతన మండలాల అధ్యక్షుల నియామకం



నూతన అధ్యక్షులను సన్మానిస్తున్న జన్‌వాడే సంగప్ప

నారాయణఖేడ్: నియోజకవర్గంలోని 8 మండలాలకు, ఖేడ్ టౌన్‌కు బీజేపీ నూతన మండల అధ్యక్షులను నియమించినట్లు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జన్‌వాడే సంగప్ప తెలిపారు. నారాయణఖేడ్‌లో సోమవారం నూతన అధ్యక్షులకు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కంగ్టి మండల అధ్యక్షుడిగా సంతోష్‌రెడ్డి, సిర్గాపూర్‌కు గోపాల్‌రెడ్డి, కల్హేర్‌కు అనిల్‌రెడ్డి, నారాయణఖేడ్ రూరల్ మండల అధ్యక్షులుగా దశరత్, మున్సిపాలిటీ అధ్యక్షుడిగా రాజశేఖర్‌గౌడ్, మనూరు మండలానికి ఈశ్వరప్ప, నాగల్‌గిద్దకు రాజశేఖర్ బిరాదర్, నిజాంపేట్‌కు పొట్టి కృష్ణలను పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి నియమించారని తెలిపారు. సమావేశంలో నిజాంపేట మాజీ మండల అధ్యక్షుడు కాశీనాథ్, పార్టీ సీనియర్ నాయకులు పట్నం మాణిక్, శంకర్ పాటిల్, శ్రావణ్, సాయి, సతీష్, ఏక్‌నాథ్, సంతోష్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

గొల్లకుంట పరిశీలన

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని కొడకంచి గ్రామ శివారులోని 216 సర్వేనంబర్‌లోని 7.2 ఎకరాల గొల్లకుంట శిఖం భూమి కబ్జాకు గురైన విషయాన్ని 'గొల్లకుంట కబ్జా' పేరిట 'సాక్షిలో' ప్రచురించిన విషయం తెలిసిందే. దీంతో కలెక్టర్ క్రాంతి ఆదేశాల మేరకు సోమవారం ఇరిగేషన్‌శాఖ ఈఈ మదుసూధన్‌రెడ్డి, డీఈ రామస్వామి, వర్క్ ఇన్‌స్పెక్టర్ మదుసూధన్‌రెడ్డి గొల్లకుంటను పరిశీలించారు. ఈ సందర్భంగా కుంటకు సంబంధించిన విస్తీర్ణం, బఫర్‌జోన్ ఏరియా గుర్తించి హద్దు రాళ్లను పాతారు. ఈఈ మదుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ అర ఎకరం వరకు శిఖం భూమిలో మట్టిని నింపారని తెలిపారు. తక్షణమే మట్టిని తొలగించాలని అక్కడి నిర్వాహకులను ఆదేశించామన్నారు. మట్టిని తొలగించని పక్షంలో నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సాక్షి ఎఫెక్ట్

బాధ్యతల స్వీకరణ



ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన మహేశ్వర్‌రెడ్డిని సోమవారం కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. కాంగ్రెస్ నేత నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐని సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరిస్తామని తెలిపారు.

కొండాపూర్ ఎస్‌ఐగా హరిశంకర్‌గౌడ్



హరిశంకర్‌గౌడ్

కొండాపూర్(సంగారెడ్డి): కొండాపూర్ నూతన ఎస్‌గా హరిశంకర్‌గౌడ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కొండాపూర్‌లోని పోలీస్‌స్టేషన్‌లో సీఐ చంద్రయ్యను మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. అనంతరం హరిశంకర్‌గౌడ్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఇంతకుముందు కొండాపూర్ ఎస్‌గా బాధ్యతలను నిర్వర్తించిన వినయ్‌కుమార్ ఇటీవలే సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

చికిత్స పొందుతూ పీఈటీ మృతి

మునిపల్లి(అందోల్): సంగారెడ్డి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కంకోల్ జిల్లా పరిషత్ ఉర్దూ మీడియం పీఈటీ ఉపాధ్యాయుడు షారోన్ (53) సోమవారం మృతి చెందాడు. జనవరి 5వ తేదీన విధులు నిర్వహిస్తున్న సమయంలో ఒక్కసారిగి బీపీ పెరగడంతో కింద పడిపోయారు. దీంతో స్థానిక ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు.

కుమారుడి అదృశ్యంపై ఫిర్యాదు

పటాన్‌చెరు టౌన్: హెడ్ కానిస్టేబుల్ కుమారుడు అదృశ్యమైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని త్రిపుర ఎంక్లేవ్‌కు చెందిన రాందాస్ సైబరాబాద్ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా ఇతని రెండో కుమారుడు సతీష్‌కుమార్ నాయక్ ఈ క్రమంలో ఈ నెల 8వ తేదీ సాయంత్రం సతీష్‌కుమార్‌నాయక్ సోదరుడిని తీసుకొని వస్తానని వెళ్లి ఎంతకూ రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతని కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెరకు లారీకి మంటలు

నారాయణఖేడ్: చెరకు లోడుతో వెళ్తున్న లారీకి పైనున్న విద్యుత్ తీగలు తగలడంతో మంటలు అంటుకున్నాయి. ఈ ఘటన ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మనూరు మండలం నుంచి ఓ లారీ చెరకు లోడుతో కామారెడ్డి జిల్లాలోని మాగి చక్కెర కర్మాగారానికి సోమవారం బయలుదేరింది. ఈ క్రమంలో ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట్‌కు రాగానే పైనున్న విద్యుత్ తీగలకు చెరకుగడలు తగలడంతో మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి డ్రైవర్‌ను అప్రమత్తం చేయడంతో లారీని నిలిపాడు. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో ఘటనాస్థలానికి చేరుకొని మంటలు ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రత పాటించాలని కార్పొరేటర్ పుష్పనగేష్ అన్నారు. డివిజన్ పరిధిలోని రాయినసముద్రం చెరువులో చేపట్టిన గుర్రపు డెక్క తొలగింపును సోమవారం పరిశీలించారు. ఆమె వెంట స్థానిక నాయకులు, కాలనీవాసులు ఉన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సహజమే



ఎంపీడీఓ విశ్వప్రసాద్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ, అధికారులు

కంది(సంగారెడ్డి): ఉద్యోగ జీవితంలో బదిలీలు సహజమేనని ఎంపీపీ సరళాపుల్లారెడ్డి అన్నారు. కంది మండల అభివృద్ధి అధికారి విశ్వప్రసాద్ వికారాబాద్ జిల్లాకు బదిలీ అయిన సందర్భంగా సోమవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండల అభివృద్ధికి ఎంపీడీఓ ఎంతో కృషి చేశారన్నారు. అనంతరం ఎంపీడీఓ విశ్వప్రసాద్‌ను ఎంపీపీ, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ లక్ష్మణ్‌గౌడ్, ఎంపీఓ మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు చంద్రి శ్రీనివాస్, హైదర్‌అలీ, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **'గృహజ్యోతి'కి దరఖాస్తు చేసుకోండి**

సంగారెడ్డి: అర్హులైనవారు గృహజ్యోతి పథకానికి ఈ నెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌ఈ మాధవరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాపాలన దరఖాస్తు రశీదు, ఆహార భద్రతా కార్డు (రేషన్ కార్డు), ఆధార్‌కార్డులను విద్యుత్‌శాఖ సిబ్బందికి, లేదా సమీపంలోని విద్యుత్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

◆ **బీజేపీ మండల అధ్యక్షుడిగా నాగరాజు**

రాయికోడ్(అందోల్): భారతీయ జనతా పార్టీ రాయికోడ్ మండల అధ్యక్షుడిగా మండలంలోని హస్నాబాద్ గ్రామానికి చెందిన నాగరాజును ఎన్నుకున్నారు. గతంలో హస్నాబాద్ గ్రామానికి చెందిన సతీష్‌కుమార్ పార్టీ మండల అధ్యక్షుడిగా ఉన్నారు. అధ్యక్ష పదవి మార్పులో భాగంగా నూతన అధ్యక్షుడిగా నాగరాజును ఎన్నుకున్నట్లు ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి, కార్యదర్శి అనంత్‌రావ్‌కులకర్ణి, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణరెడ్డి, పార్టీ మండల నాయకులు, కార్యకర్తలకు నాగరాజు ధన్యవాదాలు తెలిపారు.

◆ **ఘనంగా మల్లికార్జునస్వామి జాతర**

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని శివానగర్ గ్రామంలో మల్లికార్జునస్వామి జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి సన్నిధిలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఎమ్మెల్యే సోదరుడు, బీఆర్ఎస్ నేత మధుసూధన్‌రెడ్డి స్వామివారి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, గంగు రమేశ్ స్థానిక నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు.

◆ **రేపు ఖేడ్‌లో సేవాలాల్ జయంతి**

నారాయణఖేడ్: సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతిని నారాయణఖేడ్‌లో ఈ నెల 14న ఘనంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ బాధ్యులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట్ దుర్గాభవానీ మాత ఆలయం నుంచి సేవాలాల్ చౌరస్తా, బసవేశ్వర చౌక్, రాజీవ్ చౌక్‌ల మీదుగా తహసీల్ గ్రౌండ్ వరకు ఉత్సవ మహార్యాలీ, బోనాలతో ప్రదర్శన, గ్రౌండ్‌లో భోగ్ బండార్, అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

◆ **పేకాటరాయుళ్ల అరెస్టు**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రాజోల గ్రామ శివారులో ఆదివారం రాత్రి పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. హద్నూర్ ఎస్‌ఐ రామానాయుడు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామ శివారులో కర్నాటక ప్రా ంతానికి చెందిన కొందరు వ్యక్తులు పేకాట ఆడుతుండగా విశ్వసనీయ సమాచారం మేరకు పేకా ట స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో నలుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.41,050, పేకాట ముక్కలు స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

◆ **గ్యాస్ సిలిండర్ పేలి పూరిగుడిసె దగ్ధం**

హత్నూర(సంగారెడ్డి): గ్యాస్ సిలిండర్ పేలి పూరిగుడిసె దగ్ధమైన ఘటన హత్నూర మండల పరిధిలోని మధుర గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన తలారి సునీత పూరిగుడిసెలో ప్రమాదవశాత్తు వంట గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో పూర్తిగా దగ్ధమైంది. సంఘటన జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. స్థానికులు తీవ్రంగా శ్రమించి మంటలు అదుపులోకి తీసుకువచ్చారు. వంట సామగ్రితో పాటు బియ్యం దుస్తులు కాలి బూడిదయ్యాయని బాధిత కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

◆ **వైష్ణవి మృతిపై విచారణ జరిపించాలి**

నారాయణఖేడ్: ఇటీవల సూర్యాపేట జిల్లా ఇమామ్‌పేట సాంఘీక సంక్షేమ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వైష్ణవి మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో వైష్ణవి మృతిపైన సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొటారి నర్సింహులు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వీడ్కోలు సమావేశంలో ఉత్సాహంగా పాల్గొని ఆ తరువాత అకస్మాత్తుగా మృతి చెందడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. సమగ్ర విచారణతోనే వాస్తవాలు బయటకు వస్తాయని తెలిపారు.

◆ **ప్రహరీ నిర్మాణానికి స్థలం పరిశీలన**

మునిపల్లి(అందోల్): బుదేరా మహిళా డిగ్రీ రెసిడెన్సియల్ కళాశాలకు ప్రహరీ నిర్మించేందుకు మండల పరిధిలోని బుదేరా శివారులో 29, 30 సర్వే నంబర్లలో 20 ఎకరాల భూమిలో స్థలాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ తెన్మొళి, సర్వేయర్ కోటేశ్వర్‌రావు, అధికారులు మాట్లాడుతూ సర్వే చేసిన తర్వాత హద్దురాళ్లను ఏర్పాటు చేసి పూర్తి వివరాలను జిల్లా అధికారులకు అందజేస్తామన్నారు.

◆ **మున్నూరు కాపులు అన్ని రంగాల్లో ముందుండాలి**

పటాన్‌చెరు: మున్నూరు కాపులు అన్ని రంగాల్లో ముందుండాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గాలి అనిల్‌కుమార్, జంట నగరాల కాపు సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు రాఘవరావులు అన్నారు. ఆదివారం రాత్రి ఇస్నాపూర్‌లో శ్రీకృష్ణదేవరాయ కాపు సంఘం అధ్యక్షులు సుబ్బారావు ఆధ్వర్యంలో మున్నూరు కాపు ఆత్మీయ కలయిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్నూరు కాపుల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ సమావేశానికి వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు.

◆ **ఘనంగా ప్రథమ వార్షికోత్సవం**

ఝరాసంగం(జహీరాబాద్): మండల కేంద్రంలో నిర్మించిన జగద్గురు రేణుకాచార్య విగ్రహ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్వామి వారికి అభిషేకం, మహా మంగళహారతి తదితర పూజలు చేశారు. కార్యక్రమంలో జంగమ సమాజ్ మండల అధ్యక్షుడు రుద్రయ్యస్వామి, సభ్యులు నాగేంద్రయ్యస్వామి, శివప్రసాద్ స్వామి, వీర్ సంగయ్యస్వామి, నాగయ్యస్వామి, సంతోష్‌కుమార్ స్వామి, భద్రప్ప, శంకర్, వీరు పాల్గొన్నారు.

◆ **బీజేపీ ఆధ్వర్యంలో గావ్ చలో కార్యక్రమం**

వట్‌పల్లి(అందోల్): అందోలు మండల పరిధిలోని డాకూర్, నాదులపూర్, కొడెకల్, ఇటిక్యాల, సంగుపేట, అల్మాయిపేట, చందంపేట తదితర గ్రామాల్లో సోమవారం బీజేపీ నాయకులు గావ్ చలో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, నాయకులు శ్యామ్‌గౌడ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **తల్లి అదృశ్యంపై ఫిర్యాదు**

పటాన్‌చెరు టౌన్: తల్లి అదృశ్యంపై కుమారుడు ఫిర్యాదు చేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు పట్టణానికి చెందిన మంజుల ఈ నెల 10వ తేదీన పట్టణంలోని ముదిరాజ్ బస్తీలో ఉండే చిన్న కొడుకు ప్రసాద్‌తో గొడవపడి అదేరోజు పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో ఉండే పెద్ద కుమారుడు దాసు వద్దకు వెళ్లింది. మరుసటి రోజు అక్కడి నుంచి వెళ్లిపోయింది. దీంతో ఆమె కుటుంబసభ్యులు మంజుల కోసం ఎంతవెతికినా ఆచూకీ లభించలేదు. తల్లి అదృశ్యంపై పెద్ద కుమారుడు దాసు సోమవారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

◆ **బీజేపీకి రాంచందర్ రాజనర్సింహ రాజీనామా**

జహీరాబాద్: ఇటీవల అసెంబ్లీకి ఎన్నికల్లో జహీరాబాద్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన రాంచందర్ రాజనర్సింహ సోమవారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి పంపినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నట్లు సమాచారం. అధిష్టానం తనకు సముచిత స్థానం ఇవ్వడమే కాకుండా ఎమ్మెల్యే టికెట్‌ను కేటాయించి గౌరవించిందని, ఈ మేరకు కృతజ్ఞుడినని రాజీనామా లేఖలో వివరించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

◆ **త్రుటిలో తప్పిన ప్రమాదం**

నారాయణఖేడ్: ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొనడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన ఖేడ్ మండల పరిధిలోని డీఎస్ తండా సమీపంలో చోటుచేసుకుంది. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణఖేడ్ నుంచి స్థానిక ఆర్టీసీ డిపోనకు చెందిన బస్సు సోమవారం ఖేడ్ నుంచి నిజాంపేట వైపు వెళ్తోంది. ఈ క్రమంలో డీఎన్టీ తండా సమీపంలోని నిజాంపేట, ఖేడ్–బీదర్ 161బీ జాతీయ రహదారి మూలమలుపునకు రాగానే ఎదురు గా వస్తున్న లారీని బస్సు ఢీకొట్టింది. దీంతో బస్సు ముందు భాగం, లారీ వెనుకభాగం స్వల్పంగా దెబ్బతిన్నా ఎవరికీ గాయాలు కాలేదు. పెను ప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

◆ **అట్టహాసంగా ఆదినారాయణస్వామి ఉత్సవాలు ప్రారంభం**

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని కొడకంచి గ్రామంలోని ఆదినారాయణస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. దేవాలయ ట్రస్టీ చైర్మన్ రామాజీరావు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పది రోజుల పాటు స్వామివారి ఉత్సవాలను నిర్వహిస్తామని రామాజీరావు తెలిపారు.

◆ **పరామర్శ:**

నారాయణఖేడ్: సిర్గాపూర్ మండల పరిధిలోని వాసర్‌కు చెందిన మూరలే కిషన్‌రావు సతీమణి సోమవారం ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా జెడ్పీ ప్రణాళిక సంఘం మాజీ సభ్యులు నగేష్ శెట్కార్ గ్రామానికి వెళ్లి మృతురాలి కుటుంబీకులను పరామర్శించి ఓదార్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.